క్లుప్తంగా

ఘనంగా మల్లన్న, బీరప్ప బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు

చేవెళ్ల: మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో మంగళవారం ఘనంగా మల్లన్న, బీరప్ప బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు వేడుకగా నిర్వహించారు. రెండురోజులుగా బోనాల ఉత్సవాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తి పాటలు, బంధువులతో సందడిగా మారింది. బోనాల ఊరేగింపు ముందు పోతురాజుల విన్యాసాలు, శివసత్తులు పూనకాలు , యువకుల కేరింతలు మధ్య బోనాల ఊరేగింపు సాగింది. రాత్రి బీరప్ప ఆలయం వద్ద ఒగ్గు కళాకారులు ఒగ్గు కథలు చెప్పారు. గ్రామ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాధిక వెంకటేశ్‌లతో పాటు గ్రామ పెద్దలు, నాయకులు కలిసి ఈ ఉత్సవాలకు కావాల్సిన ఏర్పాట్లు ఘనంగా చేశారు. ఈ బోనాల ఉత్సవాల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక మండల బీఆర్‌ఎస్‌పార్టీ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రమాబాయి పోరాటాలు మరవలేనివి

అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం సుబ్రమణ్యం



నివాళి అర్పిస్తున్న అంబేద్కర్ ప్రజా సంఘం నాయకులు

షాద్‌నగర్: మాతా రమాబాయి పోరాటాలు మరువ లేనివని అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని పెన్షనర్ భవనంలో మాతా రమాబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ... సమ సమాజ నిర్మాణం కోసం మాతా రమాబాయి ఎంతో కృషి చేశారని అన్నారు. అందరు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని చెప్పారు. దేశం కోసం తన పిల్లలను సైతం త్యాగం చేసిన త్యాగమూర్తి రమాబాయి అని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్, రమేష్, వెంకటేష్, గూడెపు కార్తీక్, జ్యోతి, ఆనంద్, నవీన్, బందీశ్వర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రజలకు మెరుగైన సేవలు

డిప్యూటీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

షాబాద్: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులు నడిపించడం జరుగుతుందన్నారు. షాద్‌నగర్ డిపో నుంచి చేవెళ్లకు సమయానికి బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలన్నారు. అలాగే, షాబాద్ నుంచి సంగారెడ్డి, యాదగిరిగుట్టకు బస్సు సౌకర్యం కల్పించాలని, బస్టాండ్‌లోనే బస్సుపాస్‌ల రెన్యువల్ సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరారు. షాబాద్ మండలం కొమరబండ గ్రామానికి పాఠశాలకు బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉషా, అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్‌రావు, కంట్రోలర్ చంద్రశేఖర్‌రెడ్డి, షాబాద్, కొమరబండ సర్పంచ్‌లు సుబ్రమణ్యేశ్వరి, ఏశాల చంద్రశేఖర్, బాలయ్య, ఆంజనేయులు, వెంకటయ్య, సిబ్బంది తదితరులున్నారు.

బాలికకు వివాహం.. కేసు నమోదు

మొయినాబాద్: బాలికకు వివాహం చేసినవారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చాకలిగూడ గ్రామానికి చెందిన వెంకటేష్ తన కూతురు(15)కు ఈ నెల 5న కనకమామిడికి చెందిన శంకర్‌కు ఇచ్చి వివాహం చేశారు. బాలికకు వివాహం చేశారని అంగన్‌వాడీ టీచర్ శివలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాలిక తండ్రితోపాటు పెళ్లికి సహకరించిన ప్రవీణ్, రాములమ్మ, సుగుణమ్మ మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భూసార పరీక్షలతో సాగు బాగు

- మట్టి నమూనాలు సేకరించే విధానంలో జాగ్రత్తలు
- మండల వ్యవసాయాధికారి రాగమ్మ



భూసార పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్న అధికారులు

మొయినాబాద్: భూసార పరీక్షలు చేయించడం ద్వారా ఏయే పంటలు సాగు చేయవచ్చో తెలుస్తుందని, తద్వారా లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి రాగమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పంటల పెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు.

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో హరిత విప్లవం ద్వారా ఎంతో ప్రగతిని సాధించాం. హరిత విప్లవంలో మనం ప్రవేశపెట్టిన హైబ్రిడ్ వంగడాలు రసాయన ఎరువుల వాడకం ద్వారా మంచి దిగుబడులు ఇస్తున్నాయి. నేటి వ్యవసాయంలో రసాయన ఎరువులు, మందులు వాడకం నానాటికి పెరిగిపోతున్నది. దీంతో భూమికి ఉన్న సహజ గుణాలు, నేల ఆరోగ్య పరిస్థితి నానాటికి క్షీణిస్తోంది. అంతేకాకుండా రైతుకు పెట్టుబడి విషయంలో అధిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో సేంద్రియ ఎరువులు వాడకంతో పాటు జీవన ఎరువుల వాడకానికి ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది.

జీవన ఎరువులు భూమిలో వేసినప్పుడు వాటిలోని సూక్ష్మజీవులు అనూహ్యంగా పెరిగి మొక్కలు చురుకుగా పెరగడానికి వివిధ పోషకాలతో పాటు అవసరమైన హార్మోన్లను, విటమిన్లను అందిస్తాయి. జీవన ఎరువులు సహజ సిద్ధమైనవి. వాటి వలన వాతావరణ కాలుష్యం అనేది జరగదు. పంటకు ఏ విధమైన హాని కలగదు. వీటి వాడకం వలన రసాయన ఎరువుల వాడకం అనేది కొంత మేరకు తగ్గుతుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చు. భూసారం కూడా పెరుగుతుంది.

దీనికి సంబంధించి రైతులు భూసారాన్ని తరచూ తెలుసుకోవడం ఎంతో అవసరం. తద్వారా ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు చేయకుండా, భూసారాన్ని కాపాడుకుంటూ, అధిక, సుస్థిరమైన దిగుబడులను పొందవచ్చు. అందువల్ల రైతులు పొలంలోని మట్టిని 2 సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్ష చేయించుకోవడం మంచిది.

భూసార పరీక్షల ఆవశ్యకత...

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులందరు భూసార పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. ఎందుకంటే గత కొన్ని సంవత్సరాలుగా రైతులు అధిక దిగుబడులు ఆశించి విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూమిలో పోషకాల సమతుల్యత అనేది లోపించింది. భూసార పరీక్షలు చేయడం వల్ల పొలాల్లో లోపించిన పోషకాలను తెలుసుకొని సరైన మోతాదుల్లో ఎక్కువ తక్కువ కాకుండా ఎరువులు వేసుకోవచ్చు.



రాగమ్మ, మండల వ్యవసాయాధికారి,

మట్టి నమూనా సేకరణ విధానం.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

మొదటగా పొలంలో 'వి' ఆకారంలో 15 సెం.మీ. వరకు పారతో గుంట తీసి, అందులో పైపార నుంచి కింది వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి. ఈ విధంగా ఒక ఎకరా విస్తీర్ణంలో 8-10 చోట్ల సేకరించిన మట్టి మొత్తం ఒక దగ్గర చేర్చి, బాగా కలిపి నాలుగు భాగాలుగా చేయాలి. నాలుగు భాగాలు చేసిన మట్టిలో ఎదురు ఎదురు భాగాలు తీసుకొని అనగా 2, 3 లేదా 1, 4 భాగాలు తీసుకొని మిగతా భాగాలు తీసివేయాలి. ఈ విధంగా మట్టిని అర కిలో వచ్చే వరకు చేయాలి. ఇలా సేకరించిన మట్టిలో రాళ్ళు, వేర్ల మొదళ్ళ లేకుండా చూసుకొని నీడలో ఆరనివ్వాలి.

మట్టి నమూనా సేకరణకు రసాయనిక / సేంద్రియ ఎరువుల సంచులను వాడరాదు. గట్ల దగ్గర్లోను, పంట కాల్వల్లోను, చెట్ల కింద భాగం నుంచి ఎరువు కుప్పలు వేసిన చోట నుంచి ఎప్పుడు నీరు నిల్వ ఉండే పల్లపు స్థలంలో మట్టిని సేకరించరాదు.

పండ్ల తోటల గురించి అయితే మట్టి నమూనాను భూసార పరీక్షల కోసం ఇచ్చే ముందు ఏ నమూనా పండ్ల తోటల కోసమని సూచించాలి. మట్టి నమూనాను రైతుల పూర్తి వివరాలతో భూసార పరీక్షా కేంద్రానికి పంపించాలి.

ప్రయోజనాలు...

- ▲ భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల పొలంలో మొక్కకు కావాల్సిన పోషకాలు అనేవి ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చు.
- ▲ రైతులు వచ్చే కాలంలో ఏ పంటలు వేసుకుంటున్నారు, ఆ పంటకు కావాల్సిన ఎరువులు, వాటిని ఎంత మోతాదులో వాడాలో కూడా ఈ భూసార పరీక్షల వల్ల తెలుసుకోవచ్చు.
- ▲ భూసార పరీక్షలు చేయడం వల్ల ఏమైన విషపదార్థాలు నేలల్లో ఉన్నాయా అని రైతులు సులభంగా తెలుసుకోవచ్చు.

ఇలాంటి ఎన్నో ప్రయోజనాలు భూసార పరీక్షల ద్వారా ఉన్నాయి. కావున రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.

భూ నష్టపరిహారంలో అవకతవకలు



ఎమ్మెల్యే యాదయ్యను కలిసి అఖిలపక్షం నాయకుల, రైతులు

చేవెళ్ల: షాబాద్ మండలంలోని చందన్‌వెల్లి గ్రామ భూ బాధితుల నష్టపరిహారంలో అవకతవకలు జరిగాయని వాటిని సరిచేసి అసలైన రైతులకు న్యాయం చేయాలని అఖిలపక్షం నాయకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. చేవెళ్ల మండలకేంద్రంలో పేద రైతులకు అన్యాయం జరిగిందని వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అఖిలపక్షం నాయకులు అన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అధికారులతో మళ్లీ భూ బాధితుల వివరాలను పరిశీలించి అసలైన రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే తప్పకుండా రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయార్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పామెన భీమ్‌భరత్, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



నర్సింహులుకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: మత్స్యకారుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండలం నాగర్‌కుంట గ్రామానికి చెందిన పి.నర్సింహులును నూతన మత్స్యసహకార సంఘం అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందజేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఉచిత చేప పిల్లల పంపిణీని మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరం భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయని వాటిలో చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లింగం, కూర వెంకటయ్య, మాసయ్య, పోచయ్య తదితరులున్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జిగా అందెమోహన్



మోహన్

షాద్‌నగర్: నియోజకవర్గ యూత్ జోడో, బూత్ జోడో ఇన్‌చార్జిగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అందె మోహన్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, అనుబంధ ఇన్‌చార్జీగా కాట సుధీర్‌ను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు.

'హాత్ సే హాత్' యాత్రకు విశేష స్పందన



కరపత్రాలు పంచుతున్న కాంగ్రెస్ నాయకుడు శంకర్



ఇన్ముల్‌నర్వ యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

కాంగ్రెస్ సీనియర్ నేత శంకర్

కొత్తూరు: వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు వీర్లపల్లి శంకర్ అన్నారు. హాత్‌సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఆయన మంగళవారం మండలంలోని పెంజర్ల, ఇన్ముల్‌నర్వ, కొత్తూరు, నందిగామ మండలంలోని రంగాపూర్, తాటిగడ్డతాండల్లో యాత్రను కొనసాగించారు. దారి పొడవున కాంగ్రెస్ యాత్రకు ప్రజలు స్వతహాగా స్వాగతం పలకడంతో పాటు నాయకులతో కలిసి నడిచారు. ఇందులో భాగంగా శంకర్ పలు దుకాణాలు, వ్యవసాయ పొలాల్లో పనులు చేస్తున్న రైతులను కలిసి కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధి, ప్రస్తుతం బీఆర్‌ఎస్, బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అనంతరం కొత్తూరులో ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ కేవలం ప్రసంగాలు, అంకెల్లోనే అభివృద్ధిని చూపెడుతున్నట్లు విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీలు అభివృద్ధిపై ప్రశ్నించే ప్రతిపక్షాల నాయకులు, ప్రజా ప్రతినిధులపై పోలీసు కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, వీరమోని దేవేందర్, ఆగీరు రవికుమార్‌గుప్త, కొమ్ముకృష్ణ, కుమార్‌స్వామీగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, జంగ నర్సింహ్మా, మోహన్, శ్రీకాంత్‌రెడ్డి, దయానంద్‌గుప్త, రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ

విద్యార్థినులను అభినందించిన ప్రిన్సిపాల్



డి.పల్లవి (98.48)



బి.పల్లవి (95.96)

షాద్‌నగర్‌రూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కమ్మదనం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. మంగళవారం వెలువడిన మెయిన్స్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలను సాధించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న డి.పల్లవి 98.48శాతం సాధించగా బి.పల్లవి 95.96శాతం సాధించారు. అలాగే మరో 11మంది విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత మాట్లాడుతూ...కళాశాల అధ్యాపకులు విద్యార్థినులను ప్రోత్సహిస్తూ ఉత్తమ బోధనను అందించడం అభినందనీయమని అన్నారు. అధ్యాపకులు నిరంతరం శ్రమిస్తూ విద్యార్థినీల సందేహాలు నివృత్తి చేస్తూ బోధించడంతో అత్యుత్తమ ఫలితాలను సాధించారని అన్నారు. విద్యార్థినులకు మంచి విద్యను అందించి వారి అభ్యున్నతికి పాటుపడతామని అన్నారు. ఈ విజయ పరంపరం ముందు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినులను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి రొనాల్డ్ రోస్, జాయింట్ సెక్రటరీ శారద, ఓఎస్‌డీ చంద్రకాంత్, , హెచ్‌ఆర్‌ఆర్ ఈఎస్ రీజనల్ కోఆర్డినేటర్ నాగకల్యాణి, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు పరిష్కారం

రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి



సాంబశివరావుతో మాట్లాడుతున్న డీసీపీ

చేవెళ్ల: పెండింగ్‌లో కేసులు పరిష్కరించుకునేందుకు చక్కటి వేదిక లోక్ అదాలత్‌లని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను ఆయన సందర్శించి రిటైర్డు జడ్జి సాంబశివరావుతో కలిసి కేసుల పరిష్కారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని అన్ని పెండింగ్ కేసులు పరిష్కరించుకునేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన చేవెళ్లలోని ఏసీపీ కార్యాలయం, చేవెళ్ల పోలీస్ స్టేషన్, కోర్టును పరిశీలించారు. చేవెళ్ల డివిజన్‌లోని పోలీసు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు కేసులు తప్పవని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు పనిచేస్తుంటారని ప్రజలు గుర్తించాలని చెప్పారు. చేవెళ్ల పోలీస్ స్టేషన్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఆయన వెంట చేవెళ్ల ఏసీపీ ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు హయూమ్, ప్రదీప్‌కుమార్, ట్రాఫిక్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఎఎస్‌ఐ చందర్‌నాయక్‌లు ఉన్నారు.

మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు

చేవెళ్ల: మండలంలోని మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో అన్నిరకాల వైద్యసేవలు, ఆపరేషన్లు నెలాఖరు వరకు ఉచితంగా చేస్తున్నట్లు మంగళవారం ఆస్పత్రి యాజమాన్యం ప్రకటించింది. గత నెల జనవరి వరకు కొనసాగించిన ఉచిత సేవలను ఈ నెలాఖరు వరకు పొడగించారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగులు మందులు కొనుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభోత్సవం

షాద్‌నగర్: పట్టణంలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయం భవనం బుధవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. ఉదయం 9 గంటలకు మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు హాజర్రు కావాలని కోరారు.

టీబీ నివారణపై అవగాహన సదస్సు

షాద్‌నగర్: టీబీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ స్రవంతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కందివనం, పీర్లగూడ గ్రామాల్లో టీబీ నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. స్రవంతి మాట్లాడుతూ... టీబీ బ్యాక్టీరియా అనేది సాధారణంగా దగ్గు, తుమ్ముల సమయంలో గాలిలోకి విడుదలయ్యే చిన్న బిందువుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ బ్యాక్టీరియా సాధారణంగా ఊపిరితిత్తులకు సోకుతుందని, కాని మెదడు, మూత్ర పిండాలు లేదా వెన్నుముక వంటి ఇతర భాగాలకు కూడా సోకుతుందన్నారు. అయితే ఎవరైనా అకారణంగా బరువు తగ్గడం, నిరంతరం దగ్గు, రాత్రి పూట చెమటలు పట్టడం, జ్వ రం ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, రాజు, అరుణ, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

బీఎస్పీ నాయకుడు దొడ్డిశ్రీనివాస్



కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డిశ్రీనివాస్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్‌ల పెంపుకోసం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా దేశాన్ని పాలించిన పార్టీలు బీసీలను మోసం చేశాయని ఆరోపించారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జంతువుల లెక్కలను తేల్చే ప్రభుత్వాలు ప్రతి పది సంవత్సరాలకు చేపట్టే జనాభా లెక్కల్లో బీసీ కులాల లెక్క తేల్చకపోవడం బీసీ కులాలను అన్యాయం చేయడమేనని అన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో బీసీలకు 52శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ప్రత్యేక మంత్రిత్వ శాఖలు లేవన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పునః సమీక్షించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేదలను అందులో చేర్చాలని అన్నారు. ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా బీజీ రిజర్వేషన్‌లపై తమ వైఖరిని తెలియచేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రకారం ఎమ్మెల్యే టికెట్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తుప్పరికుమార్, శ్యామ్, నర్సింహ్మా, భరత్‌కుమార్, నవీన్‌కుమార్, యాదయ్య, అనిల్‌కుమార్, జంగయ్య, వంశీ, చందు, ప్రేమ్‌నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బోనాల సంబురం

- ఐదు సంవత్సరాల తర్వాత ఉత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన హిమాయత్‌నగర్



బోనాల ఉత్సవ ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుల దరువులు ఏర్పులమ్మల మాటలు భక్తులకు కనువిందు చేశాయి. హిమాయత్‌నగర్ గ్రామంలో ప్రజలందరు సుఖశాంతులతో సౌభాగ్యంగా ఉండాలని గ్రామ దేవత మైసమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణంతో పాటు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల క్రితం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే కాలె యాదయ్యల సమక్షంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాల నైవేద్య కార్యక్రమాన్ని మంగళవారం గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లో ఎక్కడ చూసిన అమ్మవారి విగ్రహ ఫ్లెక్సీలు, నాయకులు, యువకుల కట్‌అవుట్‌లు, విద్యుత్ కాంతులతో దీపాల లైట్లు విరజిమ్ముతున్నాయి. అమ్మవారికి మొదటగా గ్రామ సర్పంచ్ మంజుల నైవేద్యం బోనం సమర్పించారు. జంట నగరాల భక్తులు ఈ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. దీంతో హిమాయత్‌నగర్‌లో సందడిగా మారింది. ఈ ఉత్సవాల్లో ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, మాజీ ఎంపీపీ అనిత, భాస్కర్, మాజీ సర్పంచ్‌లు కంజర్ల ప్రకాష్, రాజయ్య, మల్లేష్‌యాదవ్, నాయకులు మాలయాదయ్య, బిస నర్సింహ్మా, విష్ణుష్‌గౌడ్, శివయ్య, రమేష్, మల్లేష్,శేఖర్, ప్రకాష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.